క్లుప్తంగా

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్

పెద్దదోర్నాల: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన ఓ బాలుడిని పోలీసులు చేరదీసి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు బస్టాండ్‌లో అమాయకంగా నిల్చొని ఉన్న బాలుడు కనిపించాడు. పోలీసులకు అనుమానం వచ్చి వివరాలు సేకరించారు. బాలుడు తన పేరు నరసింహ అని, తండ్రి పేరు మధు, తల్లి లలిత, నివాసం ఆత్మకూరు..అని మాత్రమే సమాధానం చెప్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడికి ఎనిమిదేళ్లు ఉంటాయి. నీలం, తెలుపు రంగుల టీషర్టుతో పాటు నలుపు నిక్కరు వేసుకుని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లవాడి సమాచారం కోసం స్థానిక సుందరయ్య కాలనీ, భారత్ పెట్రోల్ బంకు ప్రాంతాల్లో పోలీసులు విచారించారు. చివరకు బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు కూలి పనుల కోసం మండల కేంద్రానికి వచ్చినట్లు సమాచారం.

వినాయక నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

తాళ్లూరు: మండలంలోని అయ్యలపాలెంలో ఇరువర్గాల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి పండగ సందర్భంగా దేవుని ఊరేగింపు కార్యక్రమంలో ఒక వర్గం వారు బాణసంచా పేల్చారు. కొంతమంది పక్కకు వెళ్లి బాణసంచా కాల్చాలని చెప్పారు. ఈ విషయంలో ఇరువర్గాల వారు కర్రలతో కొట్టుకున్నారు. ఘర్షణలో పల్లబనేని వెంకట కిశోర్ బాబు, గవదకట్ల రమణయ్యతో పాటు వారి కుమారుడికి గాయాలయ్యాయి. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.మల్లికార్జునరావు తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి



మొక్క నాటి నీరు పోస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

పెద్దారవీడు: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలని ఉపాధి హామీ పథకం పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లిలో ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించారు. రైతులకు పెంపకంపై అవగాహన కల్పిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏపీడీ నిర్మలాదేవి, ఏపీఓ సూజాత, ఈసీ మంత్రునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రైతు వెంకట కృష్ణారెడ్డి

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగ చోరీకి గురైంది. బాధిత రైతు పులి వెంకట కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట కృష్ణారెడ్డి నీరు పెట్టుకునేందుకు సోమవారం సాయంత్రం పొలానికి వెళ్లాడు. అప్పుడు మోటార్ బాగానే పని చేసింది. తిరిగి మంగళవారం తెల్లవారుజామున పొలానికి నీరు పెట్టుకునేందుకు వెళ్లగా మోటార్ పని చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పడేసి ఉంది. అందులో ఉన్న రాగి తీగ చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఆయన తన 20 ఎకరాల భూమిలో మొక్కజొన్న, సజ్జ సాగు చేస్తున్నాడు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. వెంటనే కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాడు.

కొత్త పింఛన్లకు మంగళం

ఉన్న పింఛన్లే తీసేస్తున్న కూటమి ప్రభుత్వం

- ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయినా ఓపెన్ కాని సైట్
- గ్రామాల్లో సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తకార్డులు, పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియ



పుల్లలచెరువు సచివాలయం

పుల్లలచెరువు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా కొత్త వారికి పింఛన్ల మంజూరుకు మోక్షం ఎప్పుడు కలుగుతుందో అర్థం కావడం లేదు. పైగా పాలకులు ఉన్న పింఛన్లు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. వృద్ధాప్య, వితంతు పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు నిత్యం ఆయా గ్రామాల సచివాలయాలకు వెళ్లి ఉసూరుమంటూ వెనక్కి వస్తున్నారు. అక్కడ వారికి కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని, మళ్లీ రావాలని స్థానిక అధికారుల నుంచి సమాధానం వస్తుండటంతో వారు ఉసూరుమంటూ వెనక్కి వస్తున్నారు. మరి కొందరు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లి అధికారుల నుంచి అదే సమాధానం విని ఉసూరుమంటూ వెనక్కి వస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేది. నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంతో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక పోతున్నామని ప్రజానీకం చెబుతున్నారు. అంతేగాకుండా వివాహాలైన వారు కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు కరునిస్తుందా.. అని ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్

2024 ఏప్రిల్ 18 నుంచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ఆగిన సైట్.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏంటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి అడుగుతున్నారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, భర్త చనిపోయిన వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు రేషన్ కార్డుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో అన్ని రకాల పింఛన్లు 8 వేల మందికి అందుతుండగా నేడు అవి చాలా వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

గతం ఘనం

గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వారు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్‌కార్డులు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం ఇవ్వక పోవడంతో నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియగా ఉండాలి:



పేదలకు ఇచ్చే పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా ఇంత వరకు సైట్ ఓపెన్ చెయక పోవడంతో అర్హులు ఇబ్బంది పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు, కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి.

ఎల్.రాములు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు

కొత్త పింఛన్లకు ఆదేశాలు రావాల్సి ఉంది:

కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. స్పౌజ్ పింఛన్ల కోసం మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇతర పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

మరియదాసు, ఇన్‌చార్జి ఎంపీడీవో, పుల్లలచెరువు



శంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

కోటంశెట్టి శంకర్‌కు నివాళి

దర్శి: పట్టణానికి చెందిన కోటంశెట్టి శంకర్ మృతదేహానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర్ గుండెపోటుతో బుధవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న బూచేపల్లి ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

కురిచేడు: రైతులు వరిలో అధిక యూరియా వాడితే పైరు పచ్చదనం ఎక్కువై పురుగులు, తెగులు వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని వీవై కాలనీ, నాంచారపురం గ్రామాల్లో సాగు చేసిన కంది, వరి, మొక్కజొన్న పైర్లు పరిశీలించారు. ప్రస్తుతం వరినాట్లు నాటుతుండగా నారు కొనలు తుంచి ప్రధాన పొలంలో నాటి కాండం తొలిచే పురుగు గుడ్లను ప్రధాన పొలంలోకి రాకుండా అరికట్టవచ్చని సూచించారు. పొలంలో ఎక్కడన్నా ఆకు చుట్టు పురుగును గమనిస్తే కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని చెప్పారు. రైతులు అవసరానికి మించి యూరియా ఎక్కువ వాడితే వరి పైరు పచ్చదనం పెరిగి మెతకబడి కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు, దోమ ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని పడమర గంగవరం, కురిచేడు, పడమర వీరాయిపాలెం, ఆవులమంద, కల్లూరు, నాయుడుపాలెం రైతు సేవా కేంద్రాల్లో 42 మెట్రిక్ టన్నుల యూరియా, 18 మెట్రిక్ టన్నుల డీఏపీ, ఆరు మెట్రిక్ టన్నులు 20-20-0-13 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు సౌమ్యలత, స్పందన, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట మురుగు



బ్యాంకు ముందు చేరిన మురుగు నిల్వలు

కురిచేడు: స్థానిక కెనరా బ్యాంకు ఎదుట మురుగు నిల్వలు పెరిగి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్నపాటి వర్షానికే తటాకంలా మారే ఈ ప్రాంతంలో వర్షాలు లేకున్నా మురుగు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఆ ప్రాంతంలో పేరుకున్న చెత్త, మురుగు తొలగించినా నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు కాలువలో చెత్త అడ్డుపడి నిలిచి పోవడంతో నీరు వెనక్కు వచ్చి బ్యాంకు ముందు చేరుతున్నాయి. బ్యాంకులోకి వచ్చిపోయే ప్రజలు మురుగునీటి నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలో అడ్డుగా ఉన్న చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలని, బ్యాంకు ముందు మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బొజ్జ గణపయ్యకు ఎమ్మెల్యే తాటిపర్తి పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ స్థానిక కొలుకుల సెంటర్, పుల్లలచెరువు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతు నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకుల మునలారెడ్డి, కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, బిజ్జం రమణారెడ్డి, యక్కలి భాగ్యారావు, గోళ్ల కృష్ణారావు ఉన్నారు.

రాజన్న సేవలు మరువలేనివి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పులిపాడులో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజన్న ముఖ్యమంత్రిగా ఎందరో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. గ్రామ నాయకులు లక్కిరెడ్డి కోటిరెడ్డి, ముక్కామల రమణారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, కానాల రవి కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, ఏరేసి రమణారెడ్డి, శీలం పోలిరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరరెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, కుప్పిరెడ్డి కృష్ణారెడ్డి, గురవారెడ్డి, కేసరి జయరామిరెడ్డి, గడ్డం వినోద్, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



పులిహోర పంపిణీ చేస్తున్న నాయకులు

పోషకాహారాలు తీసుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మానస

దర్శి: విద్యార్థి స్థాయి నుంచి పోషకాహారాలు తీసుకోవాలని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి.మానస అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో జాతీయ పోషకాహార వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ జాతీయ పోషకాహార వారోత్సవాల ప్రధాన ఉద్దేశాలను వివరించారు. విద్యార్థి స్థాయి నుంచే మంచి పోషకాహారాలు తీసుకుంటే మన ఆరోగ్యాలను మనం పరిరక్షించుకోవచ్చని సూచించారు. ఎలాంటి పోషకాలు లేని జంక్ ఫుడ్స్ తీసుకుంటే అనారోగ్యం పాలవుతామని హెచ్చరించారు. నేటి బాలలే రేపటి పౌరులు కనుక ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థి నివాసాల్లో తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. కూల్‌డ్రింక్స్ విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలని గుర్తు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురిచేడు: కురిచేడు, ఆవులమంద విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఒకేషనల్ ల్యాబ్ ప్రారంభం

పెద్దారవీడు: మండలంలోని ఓబులక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ (వృత్తి విద్యా) ల్యాబ్‌ను ఎంఈఓ ప్రగధ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులు ఒకేషనల్ విద్యా పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం ద్వారా ఎంపిక కావడంతో రూ. 4.50 లక్షల విలువైన పరికరాలతో ఒకేషనల్ ల్యాబ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంఈఓ మాట్లాడుతూ వృత్తి విద్యా ద్వారా విద్యార్థులు తమ కెరీర్‌ను మెరుగుపరుచుకోవాలని, సాంకేతికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పరికరాల ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

జెడ్పీ హైస్కూల్లో పీఎంశ్రీ ల్యాబ్‌లు ప్రారంభం

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ఎంఈఓలు ఎన్.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ రమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఒకేషనల్ కోర్సులు, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సిస్టం ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మన్నం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తాగునీటి ట్యాంక్ నిచ్చెన

పెద్దారవీడు:

మండలంలోని మద్దలకట్ట మండల ప్రాథమిక పాఠశాల తాగునీటి ట్యాంక్ నిచ్చెన శిథిలావస్థకు చేరింది. ట్యాంకు పైకి ఎక్కేందుకు ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు సైతం తుప్పుబట్టి మధ్యలో నిచ్చెన చువ్వలు విరిగిపోయాయి. అలంకారప్రాయంగా నిచ్చెన కనిపిస్తోంది. ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు పైకి వెళ్లేందుకు అవకాశం లేక సిబ్బంది శుభ్రం చేయలేక పోతున్నామని చెబుతున్నారు. చట్లమిట్ల గ్రామం పంప్‌హౌస్ నుంచి ట్యాంక్ వరకు సాగర్ నీటిని సరఫరా చేస్తున్నారు. నిచ్చెనకు చెట్లు అల్లుకుని ట్యాంక్‌పైకి పోతోంది. సమీపంలో ఉన్న పాఠశాల విద్యార్థులు తెలియక నిచ్చెన పైకి ఎక్కితే ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణాపాయం తప్పదు. విద్యార్థులు నిచ్చెన ఎక్కితే ప్రమాదం చోటుచేసుకుంటుందని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తుప్పుపట్టి చువ్వలు ఊడిపోయిన నిచ్చెనను తొలగించి అదే స్థానంలో కొత్త నిచ్చెనను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ట్యాంక్ నిచ్చెన

ఘనంగా గణేష్ నిమజ్జనం

కురిచేడు: వినాయక చవితి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువకులు ఏర్పాటు చేసిన గణనాథులను మండలంలోని పడమర గంగవరంలో బుధవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథుడిని ఉంచి వాహనం ముందు జనహృదయ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి గ్రామోత్సవం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాటలతో యువకులు, మహిళలు గులాంలు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో నృత్యాలు చేశారు. కురిచేడులోని నాగార్జున సాగర్ కాలువలో గణేషుని విగ్రహం నిమజ్జనం చేశారు. అనంతరం ప్రసాదం వితరణ చేశారు.



వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో గణపతి గ్రామోత్సవం